

# దొంగలు

ఆమూరి వెంకట సీతారామమూర్తి

20-2-85

**దొంగలంటే** సీతాపతికి పరమ అసహ్యం.

దొంగతనం నీచాతి నీచమైందని అతని నమ్మకం.

దొంగల్లో చాలా రకాల వాళ్ళున్నా ఎటువంటి దొంగనైనాసరే క్షమించి వదలకూడదని అతని అభిప్రాయం.

×× ×× ××

ఊరికి చివరగా కొత్తగా కట్టబడిన కాలనీ అది. ఆ కాలనీలో ఉంటున్నాడు సీతాపతి. కాలనీ తయారైన ఏడాదివరకూ అక్కడకు మున్సిపాలిటీ కొళాయిలు రాలేదు. కారణం పైపు లైను లేక, చాలక కాదు. అక్కడి వాళ్ళు డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించకపోవడంగాని, కొళాయిల నిమిత్తమై డొనేషన్లు కట్టకపోవడంకాని అసలే కాదు. అసలు కారణం ఆ కాలనీ వాళ్ళిచ్చిన లంచాలు కార్పొరేషన్ వారికి చాలకపోవడమే-

కొండ ప్రాంతం కాబట్టి అక్కడ నూతులు తవ్వడం ఎవరి ఆర్థిక స్థితికి వారే గోతులు తవ్వుకోవడం అవుతుందని భయపడి ఎవ్వరూ అందుకు సాహసించలేకపోయారు. ఎలాగో వాళ్ళలో వాళ్ళే చర్చించుకుని, కిందా మీదా పడి, వాటర్ సప్లై వారికి కోరిన లంచాలిచ్చి నీళ్ళొచ్చేట్టు చేసుకున్నారు.

కొళాయిల్లో నీళ్ళొచ్చి ఆర్నెల్లవలేదు.

అక్కడి ఆడంగుల మనసుల్లో అసంతృప్తి మొదలయింది.

'ఇంత డబ్బూ వాళ్ళ మొఖాన కొట్టింది ఈ నులక తాడంత ధారకేనా? పోనీ అదేనా ఓ గంట ఇస్తాడంటే అదీ లేదు. అరగంట ఇచ్చి కట్టేస్తే ఇక తాగే దెలా? అవసరాలు తీరే దెలా?' అన్నా రంతా.

'ఇంకా నయం. మనం ఆ మాత్రమైనా చూస్తున్నాం. అదీ లేని వాళ్ళు కోకొల్లలీ పట్నంలో' అని ఓారడించేరు మగ మహారాయుళ్ళు.

ఇదిలా ఉండగా-గోరుచుట్టుపై రోకటి పోటులా మరో బాధ కొత్తగా ఎదురైంది ఆ కాలనీ వాసులకి. అది దొంగల బాధ!

ఆ దొంగతనం జరిగినవి కూడా కొళాయి బుర్రలు- ఇళ్ళ ఆవరణలో ఉన్న కొళాయి బుర్రలు ప్రతి రోజూ కొన్ని మాయమవడం మొదలుపెట్టాయి. పోయినవన్నీ ఇత్తడి బుర్రలే. పది రోజుల్లో సుమారొక పాతిక ఇళ్ళలో 'బుర్రల' దొంగతనం జరిగినట్టు నిరూపణ అయింది.

'నయమే- కొళాయి బుర్రలతోనే సరిపెడుతున్నారు' అని కొందరు సంతోషిస్తే-

'మన మిలా ఊరుకుంటే రేపు మన బుర్రల్నే మాయం చేసే హంతకులౌతారు వాళ్ళు' అని కొందరు హెచ్చరించేరు.

'అయితే దొంగల్ని పట్టుకోగలమా? ఎవరు పట్టుకుంటారు' అనే ప్రశ్న ఎదురైంది.

ఆ కాలనీ అభివృద్ధి కార్యక్రమాలను చూసే సంస్థ కార్యదర్శిగా కాకపోయినా, ఒక వ్యక్తిగా, ఆ కాలనీలో ఒక గృహస్థుగా, దొంగల ద్వేషిగా, ఆ దొంగ లెవరో కనుక్కుని వారిని పట్టుకునే బాధ్యతను తనపై వేసుకున్నాడు సీతాపతి.

అవి చీకటి రాత్రులు.

నాలుగు రోజులనుండీ రాత్రులు అదే ధ్యాసలో ఉన్నాడు సీతాపతి. రాత్రులు చాలా సేపటివరకూ చీకట్లోనే నిద్రపోకుండా గడుపుతున్నాడు. ఏ చిన్న శబ్దమైనా చటుక్కున లేచి చూస్తున్నాడు.

ఆ రోజూ అదే ధ్యాసలో ఉన్నాడు. ఎలాగైనా ఆ దొంగ లెవరో కనుక్కోవాలనే అతని పట్టుదల. చుట్టూ చీకటి. ఇంతలో 'దభ్' మన్న శబ్దమైతే చటుక్కున లేచి, నెమ్మదిగా కదిలి, పడక గది కిటికీలోంచి చూశాడు.

ఏదో మానవాకారం ప్రహరీ గోడ దూకి ఈశాన్యమూ లనున్న కుళాయి వైపు కదుల్తోంది.

సరిగ్గా అదే అదను-ముందుగా వేసుకున్న ప్లాను ప్రకారం దగ్గరగా వేసి ఉంచిన వంటగది తలుపులు నెమ్మదిగా తెరుచుకుని వెళ్ళి, పెరట్లోంచి చుట్టు తిరిగి వచ్చి నందివర్ధనం చెట్టు క్రింద నిలబడ్డాడు సీతాపతి.

దొంగ కొళాయి బుర్ర విప్పే ప్రయత్నంలో ఉన్నాడు. అంతే! వెనుకపాటుగా వెళ్ళి, ఆ వ్యక్తిని రెండు చేతుల్తోనూ ఒడుపుగా దొరకపుచ్చుకుని, 'దొంగ-దొంగ' అని కేకలు పెట్టాడు. రెండు నిముషాల్లో చుట్టుపక్కల ఇళ్ళలో లైట్లు వెలిగాయి. జనం బిలబిల్లాడుతూ వచ్చేరు. కొళాయి బుర్రల దొంగ దొరికిపోయాడు.

అతని చేతిలోని సంచీని గాలించా రెవరో. రెండు బుర్ర లున్నా యందులో. రెండూ ఇత్తడివే.

'వెధవని చెట్టుకు కట్టేసి బాదితే సరి. పోయినవన్నీ ఎంచక్కా తిరిగొస్తాయి' అన్నా రెవరో.

'అంతే, అంతే!' అన్నా రంతా.

కానీ సీతాపతి కది నచ్చలేదు. 'సాటి మనిషి దొంగయినా, హంతకుడయినా శిక్షించే హక్కు మనకు లేదు. వాడిని శిక్షించడానికి ప్రభుత్వ ముంది. అందుచేత పోలీసుల కప్పగించడమే న్యాయం' అన్నా డతను.

'పోలీసులూ, కోర్టులూ,సాక్షులూ అంటే మనకి న్యాయం జరిగినట్టే!' అన్నా రెవరో.

సీతాపతి ఆ మాటలేం పట్టించుకోలేదు.

పోలీసులకు ఫోన్ చేసి కేసు అప్పగించాడు.

×× ×× ××

కేసు కోర్టు కెక్కింది.

విచారణ రోజున కోర్టు ఆవరణలో చాలా మందే పోగయ్యారు. అయితే ఏ సాక్షుల అవసరమూ లేకుండానే దొంగ తన నేరాన్ని ఒప్పుకోవడం అందర్నీ ఆశ్చర్యపరచింది.

'నేను నా తప్పు ఒప్పుకొంటున్నాను. జీవితంలో మళ్ళీ ఇంకెప్పుడూ దొంగతనం చేయను. అయితే కష్టపడి పని చేసుకుందికి, పొట్ట పోషించుకోడానికీ ఓ చిన్న ఉద్యోగ మిప్పించండి చాలు-నాకు యూనివర్శిటీ వాళ్ళిచ్చిన డిగ్రీ ఉంది' అని నేరస్థుడు జడ్జీగారిని కోరేసరికి ఆ మాటలకు కోర్టు హాలంతా ఆశ్చర్యపోయింది.

కోర్టు నేరానికి శిక్షనే గాని ఉద్యోగ మివ్వదు కాబట్టి, నేరస్థునికి శిక్షనే విధించింది. దొంగలించబడిన బుర్రలన్నీ యథాతథంగా పోలీసుల కప్పజెప్పబడ్డాయి.

రెండు రోజుల తర్వాత పోలీసుల నుండి అందుకున్న పాతిక కుళాయి బుర్రలూ చూసి ఆశ్చర్యపోయాడు సీతాపతి. అవి ఇత్తడివి కావు. వంగిపోయి, ఎందుకూ పనికిరాని ఇనుప బుర్రలు!

అతని కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

'దొంగ...' లోలోపలే కసిగా గొణుక్కున్నాడు.